ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
గురువారం 1 ఫిబ్రవరి 2024

రాష్ట్ర ఎన్నికల అధికారి గుర్తింపుకార్డు మాయం

పోలీసులకు ఫిర్యాదు

పెరంబూర్, జనవరి 31: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సత్యప్రదసాహూ గుర్తింపుకార్డు కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేశా రు. రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులకు కేం ద్ర ఎన్నికల సంఘం గుర్తింపుకార్డులు అందజేస్తోంది. ప్రస్తుతం ఐడీ కార్డు అప్‌డేట్ చేసేందుకు ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయానికి పంపించాలని నిర్ణయించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహూ, ఐడీ కార్డును తపాలా ద్వారా ఢిల్లీకి పంపించాలని తన అసిస్టెంట్ శరవణన్ తెలిపినట్లు సమాచారం. దీంతో, శరవణన్ ఐడీ కార్డును పంపేందుకు తపాలా కార్యాలయానికి వెళ్తున్న సమయంలో కార్డు ఎక్కడో జారిపోయినట్లు తెలిసింది.దీంతో, ఐటీ కార్డు కనిపించడం లేదంటూ ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహూ తరఫున పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా, ఈ వ్యవహారంపై పోలీసులు విచారణ చేపట్టారు.



‘టార్చిలైట్’ చిహ్నం కోసం..
ఈసీని ఆశ్రయించిన ఎంఎన్ఎం

పెరంబూర్, జనవరి 31: లోక్‌సభ ఎన్నికల్లో ‘టార్చిలైట్’ చిహ్నం కేటాయించాలని ఎన్నికల సంఘానికి మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) వినతిపత్రం సమర్పించింది. పార్టీ అధ్యక్షుడు కమల హాసన్ విదేశాలకు వెళ్లివున్నారు. ఆయన ఆదేశాల మేరకు రానున్న లోక్‌సభ ఎన్నికలపై ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శుల సమావేశం మంగళవారం జరిగింది. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ప్రణాళిక రూపొందించేందుకు ఉపాధ్యక్షులు మౌర్య, తంగవేలు, ప్రధాన కార్యదర్శి అరుణాచలంతో కమిటీ ఏర్పాటు చేశారు. అలాగే, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి ‘టార్చి లైట్’ చిహ్నం కేటాయించాలని గత డిసెంబరు 17వ తేది ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం సమర్పించారు. దానిపై మళ్లీ ఈసీని కలిసి ఒత్తిడి తీసుకురావాలని పార్టీ నేతలు నిర్ణయించారు.



ఉన్నత శ్రేణి శస్త్రచికిత్స గదిని పరిశీలిస్తున్న మంత్రి ఎం.సుబ్రమణ్యం

ఎయిమ్స్ కోసం ఒక్కొక్క ఇటుక రాయి సేకరణ

● మంత్రి ఎం.సుబ్రమణ్యం ఎద్దేవా

ప్యారీస్, జనవరి 31: మదురైలో ఎయిమ్స్ ఆసుపత్రి కోసం కేంద్రప్రభుత్వం ఒక్కో ఇటుకరాయి సేకరించే పనిలో పడిందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ఎద్దేవా చేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకొనేందుకే ఇలా వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించారు. గిండిలో రాష్ట్రప్రభుత్వం తరఫున రూ.30.5 కోట్లతో నిర్మించిన ప్రత్యేక శస్త్రచికిత్స కేంద్రాన్ని మంత్రి సుబ్రమణ్యం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... కలైంజర్ సెంటినరీ ఉన్నత ప్రత్యేక ఆసుపత్రిలో సుమారు లక్షమందికి పైగా రోగులకు ఉన్నత శ్రేణి చికిత్సలు అందించేలా అన్నిరకాల వసతులు కల్పించామన్నారు. ఈ ఆసుపత్రిలో పేయింగ్ పేషంట్లకు 70 ప్రత్యేక గదులు అందుబాటులో ఉంటాయని, రూ.30.5 కోట్లతో అత్యాధునిక వైద్యపరికరాలతో 10 ఉన్నత శ్రేణి శస్త్రచికిత్స గదులు, 50 పడకలు కలిగిన ఎమర్జెన్సీ చికిత్సా విభాగం తదితరాలు ఏర్పాటయ్యాయని తెలిపారు. పేయింగ్ వార్డులు 24 గంటలు పనిచేస్తాయని, వైద్యులు, నర్సులు షిఫ్టు విధానంలో విధుల్లో పాల్గొంటారని తెలిపారు. 70 ప్రత్యేక గదులకు అద్దెగా వసతులను బట్టి రోజుకు రూ.1,200 నుంచి డీలక్స్ గదులకు రూ.2,000, సూపర్ డీలక్స్ గదులకు రూ.3,000 చొప్పున అద్దె నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

పెరుందురైలో రూ.400 కోట్లతో
రోకా కర్మాగారం

● స్టాలిన్ సమక్షంలో ఒప్పందం

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పింగాణీ, గృహోపయోగ వస్తువుల తయారీలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రోకా ఇంటర్నేషనల్ సంస్థ ఈరోడ్ జిల్లా పెరుందురైలో రూ.400 కోట్ల పెట్టుబడితో కొత్త కర్మాగారం ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. ఆ మేరకు స్పెయిన్ రాజధాని మాడ్రిడ్ నగరంలో ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమక్షంలో ఆ సంస్థ ప్రతినిధులు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం ప్రస్తుతం రాణిపేట, పెరుందురైలోని తమ కర్మాగారాల్లో విస్తరణ కార్యకలాపాలను కూడా రోకా సంస్థ చేపట్టనుంది. పెరుందురై రూ.400 కోట్లతో కొళాయిలు, పైప్ జంక్షన్ల తయారీ కర్మాగారాన్ని నెలకొల్పనుంది. ఈ కార్యక్రమంలో రోకా ఇంటర్నేషనల్ డైరెక్టర్ కార్లోస్ వెలాజెక్యూజ్, భారతీయ సంచాలకులు నిర్మల్‌కుమార్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, రాష్ట్ర మార్గదర్శక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.విష్ణు తదితరులు పాల్గొన్నారు.



మాడ్రిడ్‌లో సీఎం స్టాలిన్‌కు జ్ఞాపికను అందిస్తున్న రోకా ఇంటర్నేషనల్ డైరెక్టర్ కార్లోస్ వెలాజెక్యూజ్

ఆక్సియోనా ప్రతినిధుల భేటీ...

స్పెయిన్ పెట్టుబడిదారుల సదస్సులోనే ఆక్సియోనా సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రి స్టాలిన్ బృందంతో సమావేశమయ్యారు. ఆక్సియోనా ఇంటర్నేషనల్ సీఈఓ రాఫెల్ మేటియో, వాటర్ డివిజన్ సీఈఓ మేన్యుల్ మంజన్ విలిడా కలుసుకుని తమిళనాట విండ్ మిల్లుల ద్వారా విద్యుదుత్పత్తి కర్మాగారాలను నెలకొల్పేందుకు గల అవకాశాలను గురించి స్టాలిన్ వద్ద అడిగి తెలుసుకున్నారు. విండ్ మిల్లుల విద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్రం ముందంజలో ఉందని, విండ్‌మిల్లులు, నీటి శుద్ధీకరణ పరిశ్రమల స్థాపనకు అనువైన పరిస్థితులున్నాయని తెలిపారు. దీంతో సంతృప్తి చెందిన ఆక్సియోనా నిర్వాహకులు రాష్ట్రంలో విండ్‌మిల్లుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి కర్మాగారాలను నెలకొల్పేందుకు ఆసక్తి కనబరిచారు. ఈ విషయమై త్వరలోనే ఒప్పందం కుదుర్చుకుంటామని ఆక్సియోనా ప్రతినిధులు పేర్కొన్నారు.

ఉత్తర చెన్నై అభివృద్ధికి రూ.1,000 కోట్లు

● మేయర్ ప్రియ

ప్యారీస్, జనవరి 31: ఉత్తర చెన్నై అభివృద్ధికి రూ.1,000 కోట్లు కేటాయించినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) మేయర్ ఆర్.ప్రియ పేర్కొన్నారు. సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రధాన కార్యాలయం రిప్పన్ బిల్డింగ్‌లోని సమావేశం హాలులో మేయర్ అధ్యక్షతన బుధవారం ఉదయం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 35 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సీపీఎం, కాంగ్రెస్, జోన్ చైర్మన్ తదితరులు తమ వార్డులకు సంబంధించిన అభివృద్ధి పనుల గురించి అడిగిన ప్రశ్నలకు మేయర్ సమాధానం చెప్పారు. అభివృద్ధిలో వెనుకబడి ఉన్న ఉత్తర చెన్నైలో కనీస వసతుల కల్పనకు రూ.1,000 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. కార్పొరేషన్, మెట్రోవాటర్ బోర్డు, ప్రజాపనుల శాఖ, ఆరోగ్య శాఖ, ఉద్యనవన శాఖలు సమన్వయంగా నిధులు కేటాయించాయని, సీఎండీఏ పరిశీలన సమావేశంలో వివరాలు అడిగి ఎక్కడెక్కడ పనులు జరుగుతున్నాయి? ఏఏ పథకాలకు ఏ మేరకు నిధులు కేటాయించారు అన్న వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు మేయర్ తెలిపారు.

తవ్వకాలు జరపొద్దు...

అనంతరం కమిషనర్ డా.జె.రాధాకృష్ణన్ మాట్లాడుతూ... నగరంలో జీసీసీ ఆధీనంలో ఉన్న 200 వార్డుల్లో కొత్తగా ఏర్పాటు చేసిన రోడ్లపై జీసీసీ అనుమతి లేకుండా ప్రభుత్వ శాఖలు ఎలాంటి తవ్వకాలు జరపరాదని, ముఖ్యంగా విద్యుత్ బోర్డు తరఫున తవ్వకాలు జరిపినట్లయితే వాటిని ఈబీ ఇంజనీర్లు పర్యవేక్షించి వెంటనే పూడ్చివేసే చర్యలు చేపట్టాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు. మురుగప్పనగర్‌లో తుఫానుకు నేలకూలిన విద్యుత్ స్తంభాల తొలగింపు పనులను వేగవంతం చేయాలని సీపీఎం సభ్యుడు జయరామన్ కోరగా, త్వరలోనే పనులు చేపట్టనున్నట్లు మేయర్ తెలిపారు. కొడుంగైయూర్ డంపింగ్ యార్డ్‌లో బయో మైనింగ్ పథకానికి త్వరలోనే టెండర్లు ఆహ్వానించనున్నట్లు మేయర్ తెలిపారు.



జీసీసీ సమావేశంలో కమిషనర్ రాధాకృష్ణన్, మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్

ఆ రూ.1,000 కోట్లు ఏమయ్యాయి...?

సమావేశంలో ముందుగా సీపీఎం కౌన్సిలర్ జయరామన్ మాట్లాడుతూ... తాను కౌన్సిలర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులో తుఫాను కారణంగా సుమారు 100కు పైగా విద్యుత్ స్తంభాలు కూలాయని, మురుగప్పనగర్‌లో నెల రోజులు గడిచినా ఇప్పటివరకు విద్యుత్ బోర్డు తరఫున ఎలాంటి పనులు చేపట్టలేదన్నారు. ఏ పనులు చేసినా ఉత్తర చెన్నై అభివృద్ధి నిధుల నుంచి చేపడుతున్నట్లు ప్రభుత్వ అధికారులు చెబుతున్నారని, అయితే ఏ పథకానికి ఎన్ని నిధులు కేటాయిస్తున్నారన్న స్పష్టత లేదన్నారు. ముఖ్యంగా ఉత్తర చెన్నై అభివృద్ధి నిమిత్తం సీఎండీఏ కేటాయించిన రూ.1,000 కోట్ల నిధులు ఏమయ్యాయని, దీనిపై వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ... సీఎండీఏ నిధులతో 30 నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెబుతున్న అధికారులు, ఆ పనుల గురించి ఇప్పటివరకు తెలియజేయలేదన్నారు. కమిషనర్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ... రాష్ట్రప్రభుత్వం తరఫున సమన్వయ కమిటీ సమావేశం బుధవారం జరిగిందని, సీఎండీఏ కేటాయిస్తున్న నిధులు పలు శాఖలకు చేరుతోందని, ఆ వివరాలు త్వరలోనే వెల్లడించనున్నట్లు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ కౌన్సిలర్ ఢిల్లీబాబు మాట్లాడుతూ... కొడుంగైయూర్‌లో ఉన్న డంపింగ్ యార్డ్‌లో బయోమైనింగ్ ప్రాజెక్ట్ ప్రకారం చెత్త రీసైక్లింగ్ చేసేందుకు స్థలం కేటాయిస్తామని గత సంవత్సరంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో మేయర్ ప్రియ హామీ ఇచ్చారని, అయితే ఇప్పటి వరకు ఎలాంటి పనులు జరగలేదన్నారు. అంతేకాకుండా కొడుంగైయూర్, ఎంబీకే నగర్, వ్యాసర్పాడి తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న హిందూ, ముస్లిం, క్రైస్తవుల శ్మశాన వాటికల నిర్మాణపనులు నత్తనడకగా సాగుతున్నాయని ఆరోపించారు.



బోసిపోయి కనిపిస్తున్న కోయంబేడు బస్టాండు

బోసిపోయిన కోయంబేడు బస్టాండు

నామమాత్రంగా ప్రయాణికుల రద్దీ ● ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

అడయార్, జనవరి 31: నిత్యం రద్దీగా కనిపించే కోయంబేడు బస్టాండు బోసిపోయి కనిపిస్తోంది. ఈ బస్టాండు నుంచి దక్షిణాది జిల్లాలకు వెళ్లాల్సిన అన్ని రకాల బస్సులను నగర శివారు ప్రాంతమైన కిళంబాక్కంలో కొత్తగా నిర్మించిన కలైంజర్ శతవార్షిక కొత్త బస్టాండు నుంచి బయలుదేరి వెళ్లేలా రవాణా శాఖ చర్యలు చేపట్టింది. దీంతో విల్లుపురం, కుంభకోణంతో పాటు వివిధ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్లకు చెందిన బస్సుల్లో 80 శాతం బస్సులు కిళంబాక్కం బస్టాండు నుంచి బయలుదేరి వెళుతున్నాయి. మిగిలిన 20 శాతం బస్సులు మాత్రం మాధవరం బస్టాండు నుంచి దక్షిణాది జిల్లాలకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం కోయంబేడు బస్టాండు నుంచి కాంచీపురం, వేలూరు, ఆరణి, పుదుచ్చేరి, బెంగుళూరు ప్రాంతాల వైపు వెళ్ళే బస్సులు మాత్రమే నడుపుతున్నారు. దీంతో ఈ బస్టాండు ఇపుడు బోసిబోయి కనిపిస్తోంది. ఈ బస్టాండులో వ్యాపారాలు చేసుకుంటూ వచ్చిన చిరు వ్యాపారులు దాదాపుగా తమ దుకాణాలను మూసివేశారు. అదేవిధంగా ఈ బస్టాండులోని దుకాణాలను కూడా సీఎండీఏ అధికారులు స్వాధీనం చేసుకుని తాళాలు వేస్తున్నారు. గతంలో ఈ బస్టాండులోని ఆరు ప్లాట్‌ఫాంల నుంచి ప్రతి రోజూ దాదాపు 2100 బస్సు సర్వీసులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించేవి. ఇపుడు ఈ బస్సులన్నీ ఒక్కసారిగా నిలిపివేయడంతో ఈ బస్టాండులో ప్రయాణికుల రద్దీ కనిపించడం లేదు. అలాగే, కోయంబేడు పరిసర ప్రాంతాల్లో కూడా ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గింది. ఇదిలావుండగా, మాధవరం బస్టాండు నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు బస్సులు వెళ్ళేవి. ఇపుడు ఇక్కడ నుంచి కొన్ని దక్షిణాది జిల్లాలకు బస్సులు నడుపుతున్నారు. ముఖ్యంగా తిరుచ్చి, సేలం, విరుదాచలం, కళ్ళకుర్చి, విల్లుపురం, కుంభకోణం, చిదంబరం, నైవేలి, కడలూరు, పుదుచ్చేరి, తిరువణ్ణామలై, వందవాసి తదితర ప్రాంతాలకు 160 బస్సులను నడుపుతున్నారు. ఈ ప్రాంతాలకు కిళంబాక్కం బస్టాండు నుంచి 80 శాతం బస్సులు నడుపుతున్నారు.

పెరంబూర్, జనవరి 31: స్థానిక కిళంబాక్కం బస్ టెర్మినల్ నుంచి పొరుగు ప్రాంతాలకు వెళ్లే అన్ని రకాల బస్సులు నడపాలని రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ ఆమ్నీ బస్సుల యజమానుల సంఘం హైకోర్టులో పిటిషన్ దాఖలుచేసింది. కిళంబాక్కం బస్టాండ్ నుంచి నగరానికి రావాలంటే ప్రయాణికులతో పాటు ఆమ్నీ బస్సుల సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల ఈ కేసు విచారణ ముగిసే వరకు కోయంబేడు నుంచి ఆమ్నీ బస్సులు నడిపేందుకు అనుమతించాలని కోరారు. ఈ పిటిషన్ బుధవారం విచారించిన న్యాయస్థానం, దక్షిణ జిల్లాలకు వెళ్లే ఆమ్నీ బస్సులు కొన్ని వారాలు కోయంబేడు నుంచి నడిపేందుకు సాధ్యమవుతుందా? అనే విషయమై రాష్ట్ర రవాణా సంస్థ కమిషనర్ గురువారం అఫిడవిట్ దాఖలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.

కోయంబేడు నుంచి ఆమ్నీ బస్సులు నడిపేందుకు వీలుందా?

● హైకోర్టు ప్రశ్న

‘మిమ్మల్ని వెతుకుతూ... మీ ఊళ్లో’

ప్రజలకు అందుబాటులో కలెక్టర్లు

● రాష్ట్రంలో కొత్త పథకం అమలు

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బుధవారం జిల్లా కలెక్టర్లు గ్రామబాట పట్టారు. గ్రామీణ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రులు, పాఠశాలలు తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో తనిఖీలు జరిపారు. ప్రజలకు అందాల్సిన వసతులపై ఆరా తీశారు. కొన్ని సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించారు. ప్రభుత్వ పథకాలు మారుమూల గ్రామాల ప్రజలకు అందుతున్నాయా లేదా అని గుర్తించేందుకు డీఎంకే ప్రభుత్వం ‘మిమ్మల్ని వెతుకుతూ... మీ ఊళ్లో’ అనే సరికొత్త పథకానికి నవంబర్‌లో సీఎం స్టాలిన్ శ్రీకారం చుట్టిన విషయం విదితమే. ఈ మేరకు ప్రకారం ప్రతినెలా నాలుగో బుధవారం చెన్నై మినహా తక్కిన జిల్లాల కలెక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. ఆ మేరకు బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో కలెక్టర్లు తాము పరిశీలనకకు వెళ్లే ప్రాంతాల్లో 24 గంటలపాటు బస చేయడానికి సిద్ధమయ్యారు. వీరంతా తామెంచుకున్న ఊళ్లకు వెళ్లి ప్రభుత్వ ఆసుపత్రి, పాఠశాలలు, ప్రభుత్వ హాస్టళ్లు, సామాజిక కేంద్రాలు, బస్టాండు, ఉద్యానవనాలను అధికారులతో తనిఖీలు జరిపారు.

24 గంటల పాటు...

చెన్నై సమీపంలోని తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లోనూ కలెక్టర్లు గ్రామీణ ప్రాంతాలకు తరలివెళ్లారు. ఈ మూడు జిల్లాలకు చెందిన కలెక్టర్లు బుధవారం ఉదయం 9నుంచి గురువారం ఉదయం 9 గంటల వరకు తమకు కేటాయించిన కాంచీపురం, తిరుపోరూరు, ఊత్తుకోట డివిజన్లలోని ప్రజలకు సేవలందించటానికి సిద్ధమయ్యారు. కాంచీపురం జిల్లా కలెక్టర్ కలై సెల్వి మోహన్ ఉదయం తొమ్మిది గంటలకు అక్కడి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి అధికారులతో చర్చలు జరిపారు. ఆ తర్వాత ఈసేవా కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రేషన్‌షాపులు, పౌష్టికాహార కేంద్రాలను పరిశీలించారు. అటుపిమ్మట తహసీల్దార్ కార్యాలయం, బీడీఓ కార్యాలయం, గ్రామనిర్వహణాధికారి కార్యాలయం, పంచాయతీ యూనియన్ కార్యాలయంలో తనిఖీలు జరిపారు. సాయంత్రం 4.30 నుండి 6 గంటల వరకు స్థానిక ప్రజలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ ఊత్తుకోట డివిజన్‌లో తన సేవలను ప్రారంభించారు. ఉదయం తొమ్మిది గంటలకు తచ్చూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ జరిపారు. అమ్మంబాక్కం, మదురానీతంజేరిలోని పాఠశాలను పరిశీలించారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆ డివిజన్‌లోని ప్రభుత్వ సంస్థల అధికారులతో సమావేశమయ్యారు. ప్రజలకు అభివృద్ధి పథకాల ఫలాలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు. సాయంత్రం 6.30 గంటలకు ఊత్తుకోటలోని ఆదిద్రావిడుల, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర హాస్టల్‌ను, బస్‌స్టాండును, ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. చెంగల్పట్టు జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అరుణ్‌రాజ్ తిరుప్పోరూరు నగర పంచాయతీ ప్రాంతంలో తనిఖీలు జరిపారు. రహదారుల్లో అధికారులను వెంటబెట్టుకుని ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహార పథకం కేంద్రాన్ని, ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. కేలంబాక్కం, అరుంగుండ్రం, ఒరగడం గ్రామాలలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలపై పరిశీలన జరిపారు. సాయంత్రం 4 గంటల నుంచి తండలం, మయిలై, నావలూరు, కీళూరు తదితర గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



కాంచీపురంలో ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వస్తున్న వ్యక్తిని పలకరిస్తున్న కలెక్టర్ కలైసెల్వి మోహన్

సమాచార ధ్వని

నేటినుంచి సీజన్ టిక్కెట్ల విక్రయాలు

ఐసిఎఫ్, జనవరి 31: కిళంబాక్కం కలైంజర్ సెంటినరీ బస్ టెర్మినల్‌లో ఈ నెల 1న గురువారం నుంచి సీజన్ టిక్కెట్ల విక్రయాలు ప్రారంభం కానున్నాయి. రూ.1,000 (ప్రతి నెలా 16 నుంచి మరుసటి నెల 15వ తేది వరకు), మాసాంతపు రాయితీ కార్డు (ప్రతి నెలా 1 నుంచి 22వ తేది వరకు), 50 శాతం విద్యార్థుల రాయితీ ట్రావెల్ కార్డు (ప్రతి నెలా 11 నుంచి మరుసటి నెల 10వ తేది వరకు), టిక్కెట్లు ప్రతినెలా 1 నుంచి 13వ తేది వరకు అందజేయనున్నారు. అలాగే, సీనియర్ సిటిజన్లకు ఉచిత ప్రయాణ కార్డుతో పది టోకెన్లను కిళంబాక్కం డిపోలో అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు కాంచీపురంలో స్కూళ్లకు సెలవు

ఐసిఎఫ్, జనవరి 31: కాంచీపురంలో ఉన్న 11 పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ కలైసెల్వి ఉత్తర్వులు జారీచేశారు. ప్రాచీన, చారిత్రాత్మకమైన కాంచీపురంలో ఉన్న సుందరాంబికై సమేత కచ్చపేశ్వరర్ ఆలయ కుంభాభిషేకం గురువారం జరగనుంది. ఈ సందర్భంగా ట్రాఫిక్ మార్పులు చేపట్టనుండడంతో ఆ ప్రాంతంలో ఉన్న పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మార్చి 6న శివరాత్రి ప్రత్యేక రైలు

ఐసిఎఫ్, జనవరి 31: మహాశివరాత్రి ప్రత్యేక నవ జ్యోతిర్లింగ యాత్రా రైలు మార్చి 6వ తేది కోయంబత్తూర్ నుంచి బయల్దేరనుంది. 13 రోజుల ఈ యాత్రలో మహాకాళేశ్వరం, ఓంకాశ్వరం, సోమనాథ్, పుణె వంటి క్షేత్రాలు సందర్శించవచ్చు. కోయంబత్తూర్ నుంచి బయల్దేరే రైలు పొల్లాచ్చి, పళని, దిండుగల్, తిరుచ్చి, విల్లుపురం, విరుదాచలం, చెన్నై మీదుగా ప్రయాణిస్తుంది. ఏసీ కోచ్‌లో ఒకరికి రూ.39,900, స్లీపర్ కోచ్‌లో రూ.25,950 ఛార్జీగా నిర్ణయించారు. వివరాలకు నెం.7305858585లో సంప్రదించవచ్చు.

తక్కువ తూకంతో వస్తువులందిస్తే చర్యలు

ఐసిఎఫ్, జనవరి 31: రేషన్ దుకాణాలకు తక్కువ తూకంతో వస్తువులు తరలిస్తే కఠిన చర్యలు చేపట్టనున్నట్లు సహకార, ఆహార శాఖ హెచ్చరించింది. రేషన్ దుకాణాల్లో కార్డుదారులకు అందజేసే ఆహార వస్తువులను వినియోగ వస్తువుల వాణిజ్య సంస్థ సహకార సంఘాల ద్వారా సరఫరా చేస్తోంది. ఈ సంఘాల గోడౌన్ల నుంచి రేషన్ దుకాణాలకు వస్తువులు సరఫరా చేసే సమయంలో బస్తాలో సుమారు 5 కిలోల వరకు తూకం తగ్గుతున్నట్లు అధికారులకు ఫిర్యాదులొస్తున్నాయి. దీనిపై స్పందించిన సహకార, ఆహార శాఖ అధికారులు... ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై శాఖాపరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

స్థానిక సంస్థలకు రూ.558 కోట్ల విడుదల

ఐసిఎఫ్, జనవరి 31: స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక కమిషన్ నిధుల నుంచి రెండో విడతగా రూ.558.41 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో 12,519 పంచాయతీలు, 388 పంచాయతీ యూనియన్లు, 36 జిల్లా పంచాయతీలున్నాయి. వీటికి కేంద్ర నిధుల కమిషన్ సిఫారసు ప్రకారం ఈ సంవత్సరం నిధులుగా గత అక్టోబరు 25వ తేది రూ.557.98 కోట్లు తొలివిడతగా అందజేశారు. ఈ నేపథ్యంలో, రెండో విడతగా రూ.558 కోట్లు కేటాయించాలని గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయగా, రూ.558.41 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో రూ.446.77 కోట్లు పంచాయతీలకు, రూ.83.77 కోట్లు పంచాయతీ యూనియన్లకు, రూ.27.91 కోట్లు జిల్లా పంచాయతీలకు కేటాయించారు.

గ్రూప్-4 పరీక్షకు ఉచిత శిక్షణ

ఐసిఎఫ్, జనవరి 31: టీఎన్‌పీఎస్సీ నిర్వహించనున్న గ్రూప్-4పరీక్షకు ఉచితశిక్షణ ఇవ్వనున్నట్లు ఉద్యోగ అవకాశాలు, శిక్షణ శాఖ కమిషనర్ సుందరవల్లి తెలిపారు. గ్రూప్-4లో 6,244 ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ మంగళవారం విడుదలైంది.ఈపరీక్షకు ఉచిత కోచింగ్ అన్నిజిల్లాల్లోఉన్న ఎంప్లాయ్‌మెంట్‌కార్యాలయాల్లో నిర్వహించనున్నారు. పరీక్ష రాయడంపై నిపుణుల ఆధ్వర్యంలో పరీక్షార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. వివరాలకు ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయాల్లో సంప్రదించవచ్చు.

చెన్నై ఆటోల పరిమితి పొడిగింపు

ఐసిఎఫ్, జనవరి 31: సీఎండీఏ సరిహద్దు విస్తరించనుండడంతో ఆటోల పరిమితులు పొడిగించినట్లు రవాణా శాఖ కమిషనర్ వెల్లడించారు. ఈ కారణంగా ఇకపై ఆటోలు కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూర్ వ రకు ప్రయాణికులను సవారీకి ఎక్కించుకోవచ్చని పేర్కొన్నారు. కోయంబేడు నుంచి దక్షిణ జిల్లాలకు వెళ్లే బస్సు లు కిళంబాక్కం బస్ టెర్మినల్‌కు మార్చారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఈ టెర్మినల్‌కు సిటీ బస్సుల్లో వెళ్లాల్సి ఉంటుంది. ఆటోల్లో పర్మిట్ సమస్య కారణంగా నేరుగా వెళ్లలేని స్థితి ఏర్పడడంతో, ఆటో డ్రైవర్ల సంఘాలు పరిమితి పొడిగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. వారి కోరిక పరిశీలించిన ప్రభుత్వం, ఆటోలు చెంగల్పట్టు, కాంచీపురం సహా సీఎండీఏ సరిహద్దు ప్రాంతాల వరకు వెళ్లొచ్చని ఉత్తర్వులు జారీ చేసింది.

చెన్నై, మదురై ఐజీల బదిలీ

పెరంబూర్, జనవరి 31: చెన్నై, మదురై ఐజీలను బదిలీ చేస్తూ రాష్ట్రప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి కె.ఫణీందర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ప్రకారం, చెన్నై నార్త్ జోన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ఐజీ) డాక్టర్ ఎన్.కన్నన్... మదురై సౌత్ జోన్ ఐజీగాను, అక్కడ పనిచేస్తున్న కేఎస్ నరేంద్ర నాయర్ చెన్నై నార్త్ జోన్ ఐజీగా బదిలీ అయ్యారు.

పెరిగిన బియ్యం ధరలు

ఐసిఎఫ్, జనవరి 31: తుఫాను కారణంగా దిగుబడులు తగ్గడంతో బియ్యం ధరలు పెరిగాయి. రెడ్‌హిల్స్, ఆంధ్ర రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నగరానికి బియ్యం దిగుమతి అవుతోంది. ఇటీవల కురిసిన భారీవర్షాలు, తుఫానుల కారణంగా పంటలు ధ్వంసమై దిగుబడులు తగ్గాయి. దీంతో రైతులు వరి ధరలు పెంచారు. ఈ నేపథ్యంలో, హఠాత్తుగా నగరంలోని మార్కెట్లో బియ్యం ధరలు పెరిగాయి. రూ.1,300కు విక్రయమైన 25 కిలోల బియ్యం బస్తా ధర రూ.100 పెరిగి రూ.1,400కు విక్రయమవుతోంది. బియ్యం నాణ్యతను బట్టి అన్ని బస్తాలు రూ.100 నుంచి రూ.200 వరకు పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. ప్రస్తుతం వరి కోతలు జరుగుతున్నాయని, దిగుమతులు పెరిగిన అనంతరం ధరలు నియంత్రణలోకి వస్తాయని హోల్‌సేల్ బియ్యం వ్యాపారులు తెలిపారు.

వెల్లుల్లి కిలో రూ.450

కోయంబేడు మార్కెట్లో కిలో వెల్లుల్లి రూ.450కు విక్రయమవుతోంది. వంటల్లో విరివిరిగా వినియోగించే వస్తువుల్లో ఒకటైన వెల్లుల్లి, నీలగిరి జిల్లాలో ఎక్కువగా సాగవుతోంది. ఈ జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి నగరానికి దిగుమతి అవుతోంది. మంచు, శీతోష్ణ స్థితుల్లో మార్పుల కారణంగా పంట దిగుబడులు తగ్గాయి. అలాగే, పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతులు తగ్గడంతో ధరలు పెరిగాయి. జనవరి మొదటి వారంలో కిలో రూ.420 వరకు విక్రయమైన వెల్లుల్లి, ప్రస్తుతం రూ.450కి పెరిగింది. గత రెండు వారాల్లో కిలోపై రూ.150 నుంచి రూ.200 వరకు పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు.

ఇద్దరు బాలికలే చదువుతున్న పాఠశాలకు ఇంత ఖర్చా?

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా పందలూరు సమీపం కావయల్ గ్రామంలో ఇద్దరు బాలికలు చదువుతున్న ప్రాథమిక పాఠశాలలో కొత్త తరగతి గదిని నిర్మించేందుకు ప్రభుత్వం రూ.25లక్షలతో నిర్మాణ పనులు చేపట్టడంతో స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. 1982లో ఐదెకరాల్లో ప్రాథమిక పాఠశాలను నిర్మించారు. కావయల్ గ్రామంలో తేయాకు తోటలలో పనిచేసే కార్మికులే అధికంగా ఉన్నారు. తొలుత ఆ పాఠశాలలో కార్మికుల పిల్లలందరూ చదువుతుండేవారు. ఆ తర్వాత కార్మికులంతా తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లల్లో చేర్చారు. దీనితో క్రమంగా ఆ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. చివరకు నాలుగో తరగతిలో ఓ బాలిక, మూడో తరగతిలో ఓ బాలిక చదువుతున్నారు. ఆ ఇద్దరు బాలికల కోసం నడుపుతున్న ఆ పాఠశాలను ప్రభుత్వం మూసివేయడానికి వెనుకాడుతోంది. ఆ పాఠశాల ఎన్నికల పోలింగ్ కేంద్రంగా ఉండటమే దీనికి కారణం. ఈ పరిస్థితుల్లో ఉన్నట్టుండి ఆ పాఠశాలలో కొత్తగా తరగతి గదిని నిర్మించేందుకు రూ.25లక్షలు కేటాయించారు. అయితే ఆ నిధులతో ప్రస్తుతం బాగా ఉన్న తరగదిని కూల్చివేసి దాని స్థానంలో కొత్త తరగతి గదిని నిర్మిస్తున్నారు. బాగున్న తరగతి గదిని కూల్చివేయడమెందుకు? ప్రస్తుతం ఇద్దరు బాలికలే చదువుతున్న ఆ పాఠశాలలో రూ.25లక్షలతో కొత్త తరగతి గదిని నిర్మించడం ఎందుకు? అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ... ఆ పాఠశాల భవనాలు దుస్థితిలో ఉండటం వల్లే తొలుత తరగతి గదిని కూల్చివేసి కొత్త తరగతి గదిని నిర్మించతలపెట్టామని వివరించారు.



కావయల్ పాఠశాలలో చదువుతున్న బాలికలు

అసెంబ్లీ ఎన్నికలొస్తే 200 స్థానాల్లో విజయం

● మాజీ మంత్రి విజయభాస్కర్

పెరంబూర్, జనవరి 31: రాష్ట్ర అసెంబ్లీకి ఎప్పుడు ఎన్నికలు జరిగినా 200 స్థానాల్లో విజయం సాధించి, ముఖ్యమంత్రిగా ఎడప్పాడి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటవుతుందని అన్నాడీఎంకే మాజీ మంత్రి డాక్టర్ సి.విజయభాస్కర్ తెలిపారు. కరూర్‌లో మంగళవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా, స్పెయిన్ దేశ ఆర్థికాభివృద్ధి మందగించిన సమయంలో, రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఆ దేశానికి వెళ్లి పెట్టుబడులు కోరడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. 'నీట్ రద్దు, పాత పింఛన్ విధానం అమలు సహా 500 కల్లబొల్లి వాగ్దానాలను డీఎంకే ఎన్నికల ప్రచారంలో ప్రకటించిందన్నారు. అన్నాడీఎంకే కంటే కేవలం 3శాతం ఓట్లు రాబట్టుకొని అధికారం చేజిక్కించుకుందన్నారు. అధికారం చేపట్టిన మూడేళ్లు దాటినా ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. నీట్ రద్దు పేరుతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సంతకాలతో కూడిన పత్రాలు సేలం రోడ్ల పక్కన కనపడుతున్నాయన్నారు. అలాగే, పాత పింఛన్ విధానంపై ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమ్మె బాట పట్టారన్నారు.

మద్యం ధరల పెంపు

● పెరిగిన రాష్ట్రప్రభుత్వ ఆదాయం

ప్యారీస్, జనవరి 31: మద్యపానీయాల ధరల పెంపుతో రాష్ట్రప్రభుత్వానికి పన్నుల రూపంలో రూ.2,500 కోట్ల ఆదాయం పెరిగిందని, అలాగే ఆస్తులకు సంబంధించిన పన్ను ఆదాయం కూడా ఈ ఆర్థిక సంవత్సరంలో మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. సరుకులు, సేవా పన్నుల అనంతరం రాష్ట్రాల్లోని ఆర్థిక వనరుల ద్వారా సమీకరించే ఆదాయం కుంటుపడింది. తమిళనాట స్టాంప్ డ్యూటీ ఫీజులు, పెట్రోల్, డీజిల్‌పై పన్ను, మద్యపానీయాలకు విధించే ఎక్సైజ్ పన్నుల ద్వారా మాత్రమే ప్రభుత్వానికి అధిక స్థాయిలో ఆదాయం అందుతోంది. పడిపోయిన పన్ను ఆదాయాన్ని ప్రతి ఆర్థిక సంవత్సరంలో పెంచే దిశగా డీఎంకే ప్రభుత్వం తాజాగా పలు రంగాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఆ రీతిలో మద్యపానీయాల విక్రయాల ద్వారా పొందే ఎక్సైజ్, తదితర పన్నుల రాబడిని రూ.10,000 కోట్లుగా ప్రభుత్వం నిర్ణయించిందని, మద్యపానీయాల కొలతను బట్టి రూ.10 నుంచి రూ.20 వరకు పెంచిన ధరలు ఫిబ్రవరి 1వ తేది నుంచి అమలుకానుందని, దీని వల్ల ప్రభుత్వానికి అదనంగా మరో రూ.2,500 కోట్లు ఆదాయం సమకూరుతుందని అధికారులు తెలిపారు.

800 మంది నర్సులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులు

● మంత్రి ఎం.సుబ్రమణ్యం

ప్యారీస్, జనవరి 31: ఎమ్మార్బీ నర్సులు 800 మందికి వచ్చే వారం ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందించనున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక గిండిలో రాష్ట్రప్రభుత్వం తరఫున రూ.30.5 కోట్లతో నిర్మించిన ప్రత్యేక శస్త్రచికిత్స కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... కలైంజర్ సెంటినరీ ఉన్నత ప్రత్యేక ఆసుపత్రిలో సుమారు లక్షమందికి పైగా రోగులకు ఉన్నత శ్రేణి చికిత్సలు అందిస్తున్నామని చెప్పారు. ఈ ఆసుపత్రిలో 70 ప్రత్యేక గదులు అందుబాటులో ఉంటాయని, ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు చెల్లించి ప్రజలు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

8న ఆచార్య ఎంజే ప్రసాద్ ఉపన్యాసం

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన 'హాస్య చతురోక్తులు మరియు ఆధునిక తెలుగు కవి శ్రీశ్రీ గారితో అనుబంధం' అనే అంశంపై మోటివేషనల్ స్పీకర్ ఆచార్య ఎం.జే.ప్రసాద్ ఉపన్యసించనున్నారు. అంతేగాక 'తెలుగులో ఇతర భాషా పదాలు కలపకుండా 3 నిమిషాల పాటు మాట్లాడ్డం' కూడా ఉంటుంది. లలితా సుధాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జరుగుతుందని సమాఖ్య కార్యదర్శి కె.లక్ష్మీ మోహన్‌రావు పేర్కొన్నారు. టి.నగర్ జీఎన్ చెట్టిరోడ్డులో ఉన్న ప్రపంచ తెలుగు సమాఖ్య కార్యాలయంలో గురువారం సాయంత్రం 4.30 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని ఆమె పేర్కొన్నారు.

కస్టమ్స్ అధికారుల బదిలీ

ఐసిఎఫ్, జనవరి 31: చెన్నై విమానాశ్రయంలో సుంకపు శాఖ అధికారులు 40 మంది బదిలీ అయ్యారు. ఈ 40 మంది గత రెండేళ్లుగా విధుల్లో ఉన్నారు. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక మంత్రి ఉత్తర్వుల మేరకు వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. కొత్తగా నియమితులైన మరో 40 మంది అధికారులు చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చి చేరారు. వీరు విధులు నిర్వహించే స్థలం, నిర్వహణ, బాధ్యతలకు సంబంధించిన సలహాలను ఉన్నతాధికారులు తెలియజేశారు. గురువారం నుంచి 40 మంది అధికారులు పదవులు స్వీకరించనున్నట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు.

7వ తేది వరకు మంత్రి సెంథిల్ బాలాజి రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, జనవరి 31: మంత్రి సెంథిల్ బాలాజి రిమాండ్‌ను ఈ నెల 7వ తేది వరకు పొడిగిస్తూ చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. చట్టవ్యతిరేక నగదు బట్వాడా చట్టం కింద గత ఏడాది జూన్ 14వ తేది మంత్రి సెంథిల్ బాలాజీని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్ట్ చేసి, కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్ నిమిత్తం పుళల్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో, సెంథిల్ బాలాజి బెయిలు పిటిషన్ నిరాకరణకు గురైన నేపథ్యంలో, పుళల్ జైలులో ఉన్న ఆయన రిమాండ్ బుధవారం ముగియనుండడంతో, ఆయన్ను జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చెన్నై సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్.అల్లి ఎదుట హాజరుపరచగా, మంత్రికి 18వ సారి రిమాండ్ పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రసాద, నైవేద్యాల్లో వాటా కోసం రాస్తారోకో

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా వత్తలకుండులోని మహాపరమేశ్వరి మారియమ్మన్ ఆలయంలో పనిచేస్తున్న ఓ వర్గానికి చెందినవారు తమకు మండకపడి (ప్రసాద, నైవేద్యాల్లో వాటా) అందించాలని కోరుతూ బుధవారం ఉదయం రాస్తారోకో నిర్వహించారు. వీరికి మద్దతుగా ధర్నాలో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొనటంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈనెల 19న తొలిసారిగా వీరు ఆలయంలోనే ధర్నా జరిపారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బుధవారం ఉదయం మండకపడి కావాలంటూ డిమాండ్ చేసిన వారంతా రాస్తారోకో జరిపారు.



వత్తలకుండు వద్ద రాస్తారోకోలో మారియమ్మన్ ఆలయ సేవకులు, స్థానికులు

రూ.78 కోట్ల నియోమ్యాక్స్ ఆస్తుల జప్తు

అడయార్, జనవరి 31: అధిక వడ్డీ పేరుతో పలువురు డిపాజిట్‌దార్లను మోసం చేసిన నియో మ్యాక్స్ కంపెనీకి చెందిన రూ.78 కోట్ల ఆస్తులను జప్తు చేసినట్టు మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్‌కు మదురై ఆర్థిక నేరాల విభాగం పోలీసులు నివేదించారు. ఈ కేసులో ఈ కంపెనీలో రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు పలువురు పెట్టుబడి పెట్టారు. ఇలాంటి వారందరికీ నెలసరి వడ్డీలు చెల్లించకుండా బోర్డు తిప్పేయడంతో బాధితుల ఫిర్యాదు మేరకు మదురై ఆర్థిక నేరాల విభాగం కేసు నమోదు చేసింది. ఆ కంపెనీ ఎండీతో పాటు ఇతర డైరెక్టర్లను అరెస్టు చేసింది. బుధవారం మరోమారు కేసు విచారణకు రాగా ఆస్తులను జప్తు చేసినట్టు కోర్టుకు తెలిపారు.

అసెంబ్లీ ప్రకటనలను త్వరితగతిన పూర్తిచేయాలి

● హిందూ దేవాదాయ శాఖ అధికారులకు ఉత్తర్వులు

ప్యారీస్, జనవరి 31: అసెంబ్లీలో ముఖ్యమంత్రి స్టాలిన్ జారీ చేసిన ప్రకటన పనులను త్వరితగతిన పూర్తి చేయాలంటూ హిందూ దేవాదాయ శాఖ అధికారులకు ఆ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. నుంగంబాక్కం హైరోడ్డులో ఉన్న హిందూ దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఉదయం మంత్రి అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో... 2021-24 మధ్య దేవాదాయ శాఖ తరఫున అసెంబ్లీలో జారీ చేసిన పథకాల గురించి, 15 ఆలయాల్లో జరుగుతున్న జీర్ణోద్ధరణ పనులు, వెయ్యేళ్ల పూర్వం నాటి ఆలయాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు తదితర అంశాలపై చర్చించారు. దేవాదాయ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి మణివాసన్, ఉన్నతాధికారులు జె.కుమర గురుపరన్, కమిషనర్ మురళీధరన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పుంజుకున్నట్టుగా షో

● మాజీ మంత్రి డి.జయకుమార్ విసుర్లు

అడయార్, జనవరి 31: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ క్షేత్రస్థాయిలో పుంజుకున్నట్టుగా, బలం పెరిగినట్టుగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై షో చేస్తున్నారని అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి డి.జయకుమార్ ఎద్దేవా చేశారు. ఇదే విషయంపై ఆయన బుధవారం నగరంలో విలేకరులతో మాట్లాడుతూ, వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం పొత్తుపెట్టుకునేందుకు కొన్ని పార్టీల నేతలు సంప్రదింపులు జరుపుతున్నారనీ, ఎన్నికల సమయంలో వాటి వివరాలను పార్టీ అధినాయకత్వం వెల్లడిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీతో ఇకపై పొత్తుకు ప్రసక్తే లేదని తమ పార్టీ అగ్రనేతలు తేటతెల్లం చేశారనీ, తమ మాట కూడా ఇదేనని చెప్పారు. జాతీయ స్థాయిలో బీజేపీ బలం పెరిగినప్పటికీ రాష్ట్రంలో మాత్రం అలాంటి అవకాశమే లేదన్నారు.

ఎమ్మెల్యే కుమారుడు, కోడలు బెయిలు పిటిషన్

బాధిత బాలిక, పోలీసు శాఖకు న్యాయస్థానం నోటీసు

పెరంబూర్, జనవరి 31: డీఎంకే కుమారుడు, కోడలు బెయిలు పిటిషన్ వ్యవహారంలో బాధిత బాలిక, పోలీసు శాఖ అఫిడవిట్ దాఖలు చేయాలని, బాధిత బాలిక శుక్రవారం న్యాయస్థానానికి హాజరుకావాలని చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పల్లావరం డీఎంకే ఎమ్మెల్యే కుమారుడు, కోడలు తమ ఇంట్లో పనిచేస్తున్న తనను చిత్రహింసలు పెట్టడంతో పాటు వేతనం ఇవ్వకుండా వేధిస్తున్నారంటూ 17 ఏళ్ల బాలిక... తిరువాన్మియూర్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై 6 సెక్షన్ల కింద కేసు నమోదుచేసిన పోలీసులు, ఫిర్యాదు చేసిన రోజు నుంచి అదృశ్యమైన ఎమ్మెల్యే కుమారుడు, కోడలిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో, తమకు బెయిలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కుమారుడు ఆంట్రో మదివానన్, కోడలు మెర్లినా చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఫిర్యాదులో పేర్కొన్నట్లు బాలికను వేధించలేదని, ఆమెను తమ కుటుంబసభ్యుల్లో ఒకరిగా భావించి ప్రత్యేక పడక గది, తగిన భద్రత కల్పించామని, ఆమె ఉన్నత విద్య చదివేందుకు చర్యలు చేపట్టామని, తాము ఎలాంటి తప్పు చేయలేదని, తమకు బెయిలు మంజూరు చేయాలని ఇరువురు పిటిషన్‌లో తెలియజేశారు.

సింగిల్ జడ్జి తీర్పుపై స్టే విధింపునకు హైకోర్టు నో

● నటుడు మన్సూర్ అలీఖాన్‌కు చుక్కెదురు

అడయార్, జనవరి 31: నటి త్రిషను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన వివాదం కేసులో సింగిల్ జడ్జి లక్ష రూపాయల అపరాధం విధిస్తూ ఇచ్చిన తీర్పును సినీ నటుడు మన్సూర్ అలీఖాన్ మద్రాస్ హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు... సింగిల్ జడ్జి విధించిన తీర్పుపై స్టే విధించేందుకు నిరాకరించింది. మన్సూర్ పిటిషన్‌పై న్యాయమూర్తులు ఆర్.మహాదేవన్, మహ్మద్ షఫీక్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపి... అపరాధం చెల్లిస్తానని సింగిల్ జడ్జి ముందు అంగీకరించి, ఈ మొత్తాన్ని చెల్లించేందుకు కొంత గడువు కూడా పొంది ఇపుడు ఆ తీర్పుపై స్టే విధించాలని కోరుతూ ఎలా అప్పీల్ దాఖలు చేస్తారంటూ మన్సూర్ తరఫు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. తదుపరి విచారణను ఈనెల 7వ తేదీకి వాయిదా వేసింది.

16న దేశవ్యాప్తంగా రవాణా కార్మికుల సమ్మె

● రాష్ట్రానికి చెందిన 9 సంఘాలు మద్దతు

అడయార్, జనవరి 31: పాత పింఛను పథకాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను విరమించుకోవాలని, కనీస వేతనం అమలు చేయాలని, ఇలా మొత్తం 16 అంశాల డిమాండ్లతో ఈనెల 16న దేశవ్యాప్త సమ్మెకు రవాణా కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ సమ్మెకు రాష్ట్రం నుంచి సీఐటీయూ, ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్, ఐఎన్‌టీయూసీ, టీటీఎస్‌ఎఫ్ సహా మొత్తం 9 సంఘాల మద్దతు ప్రకటించాయని సీఐటీయూ కార్మిక సంఘం కార్యదర్శి సౌందర్‌రాజన్ వెల్లడించారు. దీంతో ఆ రోజున బస్సుల రాకపోకలపై సందిగ్ధత నెలకొంది. కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఖండిస్తున్నామని, కార్మికుల కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

62మంది ఎస్ఐల బదిలీ

పెరంబూర్, జనవరి 31: పార్లమెంటు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో, చెన్నైలో 62 మంది ఎస్ఐలను బదిలీ చేశారు. మూడేళ్లు ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న వారిని బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులతో, పోలీసు శాఖలో బదిలీలు చేపట్టాలని డీజీపీ శంకర్ జివాల్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో 62 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ఉత్తర్వులు జారీచేశారు. పుదుచ్చేరిలో ఒకే రోజు 437 మంది పోలీసులను బదిలీ చేస్తూ ఆ రాష్ట్ర హోం శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

ప్రత్యేక రైళ్ల సేవల పొడిగింపు

పెరంబూర్, జనవరి 31: వివిధ ప్రాంతాలకు నడుపుతున్న ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగిస్తూ దక్షిణ రైల్వే ప్రకటన విడుదల చేసింది. పొడిగించిన రైళ్ల రిజర్వేషన్ ప్రారంభమైందని అధికారులు తెలిపారు.

- నెం.06073 చెన్నై సెంట్రల్ - భువనేశ్వర వారాంతపు రైలు (సోమవారం) ఈ నెల 5 నుంచి ఏప్రిల్ 29వ తేది వరకు పొడిగింపు. అలాగే, నెం.06074 భువనేశ్వర్ - చెన్నై సెంట్రల్ వారాంతపు రైలు (మంగళవారం) ఈనెల 6నుంచి ఏప్రిల్ 30వ తేది వరకు పొడిగింపు
- నెం.06035 చెన్నై సెంట్రల్ - కోయంబత్తూర్ వారాంతపు వందే భారత్ ప్రత్యేక రైలు (మంగళవారం) ఈనెల 6 నుంచి 27వ తేది వరకు పొడిగింపు. అలాగే, నెం.06036 కోయంబత్తూర్ - చెన్నై సెంట్రల్ వారాంతపు వందే భారత్ ప్రత్యేక రైలు (మంగళవారం) ఈనెల 6 నుంచి 27వ తేది వరకు పొడిగింపు.
- నెం.06038 చెన్నై సెంట్రల్ - మైసూరు వందేభారత్ వారాంతపు ప్రత్యేక రైలు (బుధవారం) ఈనెల 7 నుంచి మార్చి 27వ తేది వరకు పొడిగింపు. అలాగే, నెం.06038 మైసూరు - చెన్నై సెంట్రల్ వందేభారత్ ప్రత్యేక రైలు (బుధవారం) ఈ నెల 7 నుంచి ఫిబ్రవరి 27వ తేది వరకు పొడిగింపు.
- నెం.06067 ఎగ్మూర్ - నాగర్‌కోయిల్ వందేభారత్ వారాంతపు ప్రత్యేక రైలు (గురువారం) ఈనెల 1 నుంచి మార్చి 28వ తేది వరకు పొడిగింపు. అలాగే, నెం.06068 నాగర్‌కోయిల్ - ఎగ్మూర్ వందే భారత్ వారాంతపు ప్రత్యేక రైలు (గురువారం) ఈ నెల 1 నుంచి మార్చి 28వ తేది వరకు పొడిగించారు.



మిమ్మల్ని వెతుకుతూ... మీ ఊళ్లో పథకంలో భాగంగా తచ్చూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో తనిఖీ జరుపుతున్న తిరువళ్లూరు కలెక్టర్ ప్రభుశంకర్ - తిరుప్పోరూరు వాలాజీనగర్‌లో అంగన్వాడీ కేంద్రం వద్ద తనిఖీ జరుపుతున్న చెంగల్పట్టు కలెక్టర్ అరుణ్‌రాజ్

పార్లమెంటు ఎన్నికల్లో పోటీ

● టీటీవీ దినకరన్



ప్యారీస్, జనవరి 31: పార్లమెంటు ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నట్లు అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ తెలిపారు. మదురైలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ... భారతదేశ ప్రధానిని ఎన్నుకొనే కూటమిలో తమ పార్టీ ఉంటుందని, లేని పక్షంలో ఒంటిరిగా పోటీ చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని వ్యాఖ్యానించారు. ఇక మతవాద బీజేపీతో పొత్తు కుదుర్చుకొనే ఉద్దేశం లేదని, ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక పొత్తులపై నిర్ణయం తీసుకుంటామన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఓపీఎస్‌తో కలసి రాజకీయాల్లో కొనసాగాలని నిర్ణయిస్తున్నామని, అన్నాడీఎంకేకి పార్లమెంటు ఎన్నికల్లో అధిక స్థానాలు వచ్చే అవకాశాలు లేవని దినకరన్ తెలిపారు.

మధ్యాహ్న భోజన ఖర్చులు పెంపు

పెరంబూర్, జనవరి 31: రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకంలో ఆహార ఖర్చులు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఈ పథకం ద్వారా అంగన్వాడీ కేంద్రాల్లోని 2 నుంచి ఆరేళ్లలోపున్న చిన్నారులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం ఖర్చులు పెంచారు. ఆ ప్రకారం, చిన్నారులకు అందజేసే ఖర్చులు ఒకరికి రూ.2.39 పెరిగింది. కూరగాయల ఖర్చు రూ.1.33, ఉప్పు, తాళింపు గింజల ఖర్చులు రూ.0.46, ఇంధనం ఖర్చులు రూ.0.60 పైసలు పెరిగినట్లు రాష్ట్రప్రభుత్వం తెలియజేసింది.

వానరాల వల్ల ఏర్పడిన నష్టానికి పరిహారం

● పరిశీలించాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, జనవరి 31: పండ్ల చెట్లను కోతులు ధ్వంసం చేసిందుకు పరిహారం కోరిన కేసులో రాష్ట్రప్రభుత్వం పరిశీలించాలని హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. తిరుచ్చి జిల్లా ముసిరి సమీపం మేల్‌కోట్టానికి చెందిన తాయుమన్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో... 'ముసిరి సమీపం మూవనూరులో తన సొంత స్థలంలో 2020లో జామ, 2021లో బొప్పాయి మొక్కలునాటా.కాయలు కాసే సీజన్ ప్రారంభమైన సమయంలో కోతుల దాడితో చెట్లు నాశనమయ్యాయి. అందుకు పరిహారం అందించాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించా. ఈ వ్యవహారంపై కలెక్టర్ ఉత్తర్వులతో ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ పరిశీలించి నివేదికను జిల్లా అటవీ శాఖకు సమర్పించినా ఇప్పటివరకు పరిహారం అందించలేదు. రూ.2 లక్షల పరిహారం అందించేలా ఉత్తర్వులు జారీ చేయాలి' అని పేర్కొన్నారు. ఈ పిటిషన్ మంగళవారం న్యాయమూర్తి వి.భవాని సుబ్బరాయన్ ఎదుటకు రాగా ప్రభుత్వ తరఫున హాజరైన న్యాయవాది... పిటిషన్‌దారుడి వినతిని పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం న్యాయమూర్తి... కోతుల దాడితో జరిగిన నష్టాలు గుర్తించి నిర్ధారించడం న్యాయస్థానానికి సాధ్యం కాదన్నారు. నష్టాలను ప్రభుత్వం తరఫున సంబంధిత శాఖ అధికారులు ప్రతివాదులుగా పరిగణించి, పిటిషన్‌దారుడికి పరిహారం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. పిటిషన్‌ను 16 వారాల్లో పరిశీలించి తగిన ఉత్తర్వులు జారీ చేయాలని న్యాయమూర్తి ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

● రోడ్లపై పశువులు...

యజమానులకు రూ.5 లక్షల జరిమానా

ఐసిఎఫ్, జనవరి 31: రోడ్లపై పశువులు వదిలిపెట్టిన యజమానులకు చెన్నై నగర కార్పొరేషన్ రూ.5 లక్షల జరిమానా విధించింది. రహదారులపై వాహన రాకపోకలకు అంతరాయం కలిగించే పశువులను బంధించి వాటి యజమానులకు జరిమానా విధిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో, మెరీనా తీరం, ట్రిప్లికేన్, అరుంబాక్కం, కోయంబేడు తదితర ప్రాంతాల్లో 163 పశువులను బంధించి, పశుపోషకుల నుంచి రూ.5 లక్షల జరిమానా వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.

రెండు టన్నుల గుట్కా స్వాధీనం : డ్రైవర్ అరెస్టు

ఐసిఎఫ్, జనవరి 31: ధర్మపురి జిల్లాలో సరుకుల వ్యానులో బస్తాల్లో తరలించిన రెండు టన్నుల గుట్కాను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అరెస్టు చేశారు. ధర్మపురి జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు బుధవారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారు. కృష్ణగిరి -. ధర్మపురి రహదారిలో కొత్త రౌండ్ థానా ప్రాంతంలో మైసూరు నుంచి వచ్చిన సరుకుల వ్యానును తనిఖీ చేయగా, రూ.8 లక్షల విలువైన రెండు టన్నుల పొగాకు ఉత్పత్తులున్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనపరచుకున్న అధికారులు, మైసూరు సీవీ రోడ్డు ప్రాంతానికి చెందిన డ్రైవర్ ముజీబుల్లా షరీఫ్ (50)ను అరెస్టు చేశారు.

విద్యార్థి శరీరంలో చిక్కుకున్న సూది

● శస్త్రచికిత్స ద్వారా తొలగింపు

ప్యారీస్, జనవరి 31: స్థానిక పాడి సత్యానగర్‌కు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి శరీరంలో చిక్కుకున్న సూదిని మూడు గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించి తొలగించారు. కాగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన నర్సింగ్ సెంటర్‌పై కొరట్టూరు పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో విద్యార్థి తల్లిదండ్రులు ఆవడి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. పాడి సత్యానగర్‌కు చెందిన సూర్యనారాయణ(22) కోడంబాక్కంలో ఉన్న ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్నాడు. ఈనెల 10వ తేది మిద్దె మెట్లపై జారిపడిన సూర్యనారాయణ తలకు బలమైన గాయాలయ్యాయి. అతని తల్లిదండ్రులు టీటీ ఇంజక్షన్ వేయించేందుకు సూర్యనారాయణను ఆప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు నర్సింగ్ సెంటర్‌కు తీసుకెళ్లారు. అక్కడ డ్యూటీలో ఉన్న నర్సు వేసిన ఇంజక్షన్ సూది సూర్యనారాయణ శరీరంలో చిక్కుకుంది. దీంతో బాధతో మెలికలు తిరిగిన అతన్ని వెంటనే స్కాన్ సెంటర్ తరలించి స్కానింగ్ చేయగా, నడుము కింద సూది ఉన్నట్లు గుర్తించారు. దీంతో అన్నానగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా... వైద్యులు మూడుగంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించి సూదిని తొలగించారు. దీనిపై కొరట్టూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పెన్‌కెమెరాతో వివాహిత పడకగది దృశ్యాల వీడియో

వైద్య విద్యార్థి అరెస్టు



అరెస్టైన ఇబ్రహీం

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపురంలో ఓ ఇంటి రెండో అంతస్థులో నివసిస్తున్న వివాహిత పడకగది దృశ్యాలను పెన్ కెమెరా అమర్చి రహస్యంగా వీడియో తీసిన వైద్య విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగి, 30 యేళ్ళ భార్యతో పదేళ్లుగా కాపురం చేస్తున్నారు. వీరికి తొమ్మిదేళ్ల కుమారుడు ఉన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఆ వివాహిత తన పడకగదిలో చిందరవందరగా పడి ఉన్న వస్తువులను సర్దుతుండగా పెన్ను లభించింది. ఆ పెన్నులో వీడియో కెమెరా ఉన్నట్లు గుర్తించి ఆ విషయాన్ని భర్తకు ఫోన్‌చేసి తెలిపింది. ఇరువురూ కలిసి ఆ పెన్నును నిశితంగా పరిశీలించినప్పుడు అందులో ఆమె నగ్నంగా నిలిచి దుస్తులు ధరించే దృశ్యం సహా పలురకాల వీడియోలు ఉండటం చూసి భీతిల్లారు.ఆ తర్వాత ఆ దంపతులు రాయపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు జరిపిన విచారణలో పీజీ మెడికల్ కోర్సు చదువుతున్న ఆ ఇంటి యజమాని కుమారుడు ఇబ్రహీం ఆ కెమెరాను ఆమె పడక గదిలో ఉంచి వీడియోలు తీసినట్లు వెల్లడైంది. పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

హిజ్రా హత్య కేసులో... ఇద్దరు పోలీసులకు అరెస్ట్ వారెంట్


ప్యారీస్, జనవరి 31: హిజ్రా హత్య కేసును సక్రమంగా దర్యాప్తు జరపని ఇద్దరు పోలీసులు ఉన్నతాధికారులకు అరెస్ట్ వారెంట్ జారీ చేస్తూ కాంచీపురం జిల్లా కోర్టు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీ పెరుంబుదూర్ సమీపంలో ఉన్న కిలాయ్ గ్రామానికి చెందిన కార్తీక్, సత్య, బాలు, విజయ్, సెల్వకుమార్... 2017లో ఓ హిజ్రాను ఆ ప్రాంతంలో ఉన్న ఓ తోటలోకి తీసుకెళ్లి మద్యం తాగించి లైంగిక వేధించిన అనంతరం హతమార్చారు. దీనిపై శ్రీపెరుంబుదూర్ పోలీసులు కేసు నమోదుచేసి నిందితులను జైలుకు తరలించారు. ఈ కేసు విచారణ శ్రీ పెరుం బుదూర్‌లో ఉన్న న్యాయస్థానంలో కొనసాగగా, కొన్నేళ్ల అనంతరం కాంచీపురం జిల్లా కోర్టుకు బదిలీ అయింది. న్యాయమూర్తి సెమ్మల్ సమక్షంలో బుధవారం ఉదయం మళ్లీ విచారణకు రాగా, హిజ్రా హత్యకేసును సక్రమంగా దర్యాప్తు జరపని ఇద్దరు పోలీసు అధికారులను కూడా ముద్దాయిలతో పాటు విచారణ జరపాలని ఆదేశిస్తూ, ఆ అధికారులకు అరెస్ట్ వారెంట్ జారీ చేశారు.

పుళల్ జైలులో ఖైదీ మృతి

అడయార్, జనవరి 31: స్థానిక పుళల్ సెంట్రల్ జైలులో విచారణ ఖైదీగా ఉన్న కిషోర్ కుమార్ (30) అనే ఖైదీ కిడ్నీ వ్యాధి కారణంగా మృతి చెందారు. ఈ జైలులో దాదాపు 3500 మందికిపైగా ఖైదీలు శిక్షలు అనుభవిస్తున్నారు. వీరిలో కిషోర్ కుమార్ 2019 నుంచి జైలులో విచారణ ఖైదీగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఖైదీ గత కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతూ మంగళవారం మృతి చెందినట్లు జైలు సిబ్బంది తెలిపారు. పుళల్ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

శింబు - వరలక్ష్మి పెళ్లి వదంతులకు చెక్

కోలీవుడ్‌లో మోస్ట్ బ్యాచిలర్ హీరో, హీరోయిన్ల జాబితాలో శింబు, వరలక్ష్మి శరత్‌కుమార్ ఉన్నారు. అయితే, వీరిద్దరు పెళ్లి చేసుకోబోతున్నారంటూ మూడు నాలుగు రోజులుగా వార్తలు చెక్కర్లు కొట్టాయి. దీనికి బలమైన కారణం లేకపోలేదు. వీరిద్దరూ హీరోహీరోయిన్లుగా కలిసి నటించడం, సినీ నేపథ్యం కలిగిన కుటుంబాలకు చెందిన వారు కావడం, పైగా వీరి తల్లిదండ్రులు మంచి స్నేహితులవడంతో ఈ వార్తలు నిజమై ఉంటాయని భావించారు. పైగా, శింబు పుట్టిన రోజైన ఫిబ్రవరి 3న శుభవార్తను వెల్లడిస్తానని ప్రకటించారు. దీంతో వరలక్ష్మితో తన పెళ్లి గురించి ప్రకటన చేయొచ్చని భావించారు. ఈ నేపథ్యంలో శింబు, వరలక్ష్మి ఈ వదంతులపై వేర్వేరుగా స్పందించారు. 'నేను, వరలక్ష్మి మంచి స్నేహితులం. నేను ఆమెను వివాహం చేసుకోవడం లేదు' అంటూ శింబు స్పష్టం చేశారు. అలాగే, 'శింబుకు నాకు పెళ్లి జరగడం లేదు. అతను నా స్నేహితుడు' అని వరలక్ష్మి శరత్‌కుమార్ స్పష్టం చేశారు. దీంతో తమ పెళ్లి వదంతులకు ఫుల్‌స్టాప్ పెట్టారు.



ధన్య బాలకృష్ణన్‌తో 'లాల్‌సలాం'కు చిక్కులు?



ఐశ్వర్య రజనీకాంత్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'లాల్‌సలాం'కు చిత్రంలో నటించిన హీరోయిన్లలో ఒకరైన ధన్య బాలకృష్ణన్ రూపంలో ఓ సమస్య వచ్చిపడింది. ఇది ఆ చిత్రం విడుదలపై ప్రభావం చూపే అవకాశం ఉందని కోలీవుడ్ వర్గాలు భావిస్తున్నాయి. సూపర్‌స్టార్ రజనీకాంత్ అతిథి పాత్రలో నటించిన ఈ చిత్రంలో విష్ణు విశాల్, విదార్థ్ హీరోలుగా నటించారు. ధన్య బాలకృష్ణన్ ఒక హీరోయిన్. ఈనెల 9వ తేదీన విడుదలకానుంది. అయితే, ఇపుడు సరికొత్త చర్చ తెరపైకి వచ్చింది. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ధన్య... గతంలో తమిళ ప్రజలను కించపరిచేవిధంగా కామెంట్స్ చేశారు. 'బెంగళూరు ఉంటున్న ధన్య.. గత యేడాది ఐపీఎల్ సీజన్ సమయంలో బెంగళూరు జట్టు ఆర్సీబీకి మద్దతు ప్రకటించి, తమిళ ప్రజలను హేళనగా మాట్లాడారు. ఆ సమయంలో ఆ కామెంట్స్ పెనుచర్చకు దారితీశాయి. ఈనేపథ్యంలో ఆమె తమిళ చిత్రపరిశ్రమకు దూరంగా ఉన్నారు. ఇపుడు 'లాల్‌సలాం'లో ఒక హీరోయిన్‌గా నటించగా, గతంలో రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి గతంలో ఆమె చేసిన వ్యాఖ్యలు ఇపుడు నెటిజను ట్రోల్ చేస్తున్నారు. 'తమిళ ప్రజలను అవమానించేలా మాట్లాడిన ధన్య బాలకృష్ణన్‌కు ఐశ్వర్య ఏవిధంగా తన సినిమాలో అవకాశం ఇస్తారంటూ ప్రశ్నిస్తున్నారు.

చిత్రజ్యోతి

'ప్లీజ్.. పురింజుకో'

● అదితిరావు హైదరి

కోక్ స్టూడియో తమిళ్ సీజన్-2 నుంచి మరో ఎనర్జిటిక్ ఆల్బం సాంగ్ విడుదలైంది. హీరోయిన్ అదితిరావు హైదరి, సంగీత దర్శకుడు సీన్ రోల్డన్ ఈ పాట కోసం స్టెప్పులు వేస్తూ నేపథ్యగానం చేశారు. గతంలో విడుదల చేసిన 'కారకట్టన్' ఆల్బం సాంగ్‌కు అద్భుతమైన స్పందన వచ్చిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో లేటెస్ట్ ట్రాక్‌తో ప్రేక్షకులను మరోమారు ఉర్రూతలూగించేలా 'ప్లీజ్.. పురింజుకో' సాంగ్‌ను రూపొందించారు. మల్టీటాలెంటెడ్ ఆర్టిస్ట్ అదితిరావు హైదరి, ప్రముఖ సంగీత దర్శకుడు, స్వరకర్త, గీత రచయిత అయిన సీన్ రోల్డాన్ ఈ పాట కోసం కలిసి పనిచేశారు. ఈ ఆల్బం సాంగ్ విడుదల సందర్భంగా గ్రూపు ఎం ఇండియా ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రెసిడెంట్ అశ్విన్ పద్మనాభన్ స్పందిస్తూ... 'కోక్ స్టూడియో సీజన్2 ముగిసేనాటికీ శ్రోతలు మధురమైన ప్రయాణంలో మునిగితేలుతారన్నారు. ప్రేమ సారాంశాన్ని వివిధ రూపాల్లో తెలిపే పాటగా ఉంటుంది' అని పేర్కొన్నారు. సంగీత దర్శకుడు సీన్ రోల్డాన్ స్పందిస్తూ... 'ఈ పాట ప్రతి ఒక్క ప్రేక్షకుడికి బాగా కనెక్ట్ అవుతుంది. శ్రోతలు ఎలాంటి మానసికస్థితిలో ఉన్నప్పటికీ ఎంతో శ్రద్ధగా ఆలకిస్తారు. ఈ పాటలో బాధతో పాటు ప్రేమను కూడా పంచుతుంది. ఇది డిజిటల్ యుగానికి సంబంధించిన పాట. సెంటిమెంట్‌ను ప్రతిబింబించేలా ఉంటుంది' అని పేర్కొన్నారు.



అదితిరావు హైదరి - సీన్ రోల్డన్

డైరెక్టర్ అట్లీ కొత్త చిత్రం ఎప్పుడు?

కోలీవుడ్ దర్శకుడు అట్లీ చేపట్టనున్న కొత్త ప్రాజెక్టు ఎప్పుడు ప్రారంభంకానుంది? అనే అంశం కోలీవుడ్‌లో చర్చనీయంశంగా మారింది. అగ్రహీరో విజయ్‌కు వరుస విజయాలు అందించిన అట్లీ.. గత యేడాది బాలీవుడ్ అగ్రనటుడు షారూక్ ఖాన్, దీపికా పదుకొణె, నయనతార జంటగా 'జవాన్' చిత్రాన్ని తెరకెక్కించారు. ఇది సూపర్‌హిట్ కావడంతో పాటు భారీ కలెక్షన్లు రాబట్టింది. ఈ క్రమంలో అట్లీ తదుపరి చేపట్టే ప్రాజెక్టుపై ఆసక్తి నెలకొంది. హిందీ, తెలుగు, తమిళం భాషలకు చెందిన హీరోల్లో ఒకరితో ఆయన తన కొత్త ప్రాజెక్టును ప్రారంభించే అవకాశం ఉన్నట్టు సమాచారం. ముఖ్యంగా తెలుగులో అల్లు అర్జున్‌తో సినిమా తీసే విషయంపై చర్చలు జరిగినట్టు గతంలో వార్తలు కూడా వచ్చాయి. అల్లుఅర్జున్... షారూక్‌ఖాన్... విజయ్... ఈ ముగ్గురు హీరోల్లో ఒకరితో ఆయన తన తదుపరి ప్రాజెక్టు కోసం పనిచేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తుంది. దీనిపై అట్లీ టీం క్లారిటీ ఇవ్వాల్సి ఉంది. కాగా, అట్లీ ఇటీవల సొంతంగా ప్రొడక్షన్ హౌస్‌ను ప్రారంభించి, తన మకాంను ముంబైకు మార్చిన విషయం తెల్సిందే.



దర్శకుడు అట్లీ

పళనిలో ఎడప్పాడి భక్తుల కోసం 25 టన్నుల పంచామృతం తయారీ



అరటి పళ్లను ఒలుస్తున్న మహిళలు

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పళనిలో దండాయుధపాణి ఆలయానికి ఎద్దుల బండ్లలో విచ్చేయనున్న ఎడప్పాడి ప్రాంతానికి చెందిన భక్తులకు, ఇతర ప్రాంతాల నుండి పాదయాత్రగా వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా 25 టన్నుల పంచామృతం తయారీ పనులు సాగుతున్నాయి. పళని ఆలయానికి తైపూసం వేడుకలు ముగిసిన తర్వాత సేలం, ఎడప్పాడి, నామక్కల్, ధర్మపురి తదితర ప్రాంతాల నుంచి వేలసంఖ్యలో భక్తులు పాదయాత్రగా విచ్చేయడం ఆనవాయితీ. సుమారు 50 వేలమంది భక్తులు కావళ్ల మోసుకుని విచ్చేస్తారు. ప్రస్తుతం పళని ఆలయంలో ఇటీవల తైపూస వేడుకలు ముగియడంతో సేలం, ఎడప్పాడి, ధర్మపురి తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పాదయాత్రగా బయలుదేరారు. ఈ భక్తులంతా పళని పర్వతాలయంలోనే బసచేసి స్వర్ణరథాన్ని ఊరేగించి స్వామివారిని దర్శించుకుంటారు. ఈ పాదయాత్ర భక్తుల్లో కొందరు అన్నదానం, పంచామృతం తయారీ అంటూ వివిధ కమిటీలుగా ఏర్పడి అందరికీ అన్ని సదుపాయాలు కల్పిస్తారు. ఈ నేపథ్యంలో రెండు రోజులకు ముందు సేలం జిల్లా ఎడప్పాడి నుంచి వేలసంఖ్యలో భక్తులు పాదయాత్రగా కావళ్ల మోసుకుంటూ పళని క్షేత్రానికి బయలుదేరారు. వీరందరూ తిరుప్పూరు జిల్లా కాంగేయం, తారాపురం, దిండుగల్ జిల్లా మానూరు మీదుగా పళని ఆలయం చేరుకోనున్నారు. ముందుగా వీరంతా షణ్ముగ నదీ ప్రాంతానికి విచ్చేస్తారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి కావళ్లతో పళని పర్వతాలయానికి చేరుకుంటారు. ఇదే విధంగా ఎడప్పాడి నుంచి ఎద్దుల బండ్లపై భక్తులు పళని క్షేత్రానికి బయలుదేరారు. ఆలయ అధికారులు వీరికి సంప్రదాయ రీతిలో స్వాగతం పలకనున్నారు. ఈ నేపథ్యంలో పంచామృతం తయారీ కమిటీ సభ్యులు రెండు రోజులకు ముందే పళని క్షేత్రానికి చేరుకుని పనులు ప్రారంభించింది. పళని ఆలయం దిగువ భారీ పందిరి కింద పంచామృతం తయారీ పనుల్లో పాల్గొంటున్నారు. పంచామృతం తయారీకిగాను 12 టన్నుల అరటిపండ్లు, 9 టన్నుల చక్కెర, 3 టన్నుల ఖర్జూరాలు, టన్ను కలకండ, 200 లీటర్ల తేనె, 200 లీటర్ల నెయ్యి, 30 కిలోల యాలకులు తీసుకువచ్చారు. వీటిని పెద్ద సైజు స్టీలు పాత్రలలో వేసి మిశ్రమంగా కలుపుతున్నారు. సుమారు 25 టన్నుల మేరకు పంచామృతం తయారు చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పంచామృతాన్ని కొండమీది ఆలయానికి తీసుకెళ్ళి స్వామివారికి నైవేద్యంగా సమర్పించిన తర్వాత పాదయాత్ర భక్తులందరికీ పంచిపెడతామన్నారు. ప్రస్తుతం పర్వతాలయం చుట్టూ పూలతో రంగవల్లులు వేసే పనులు కూడా సాగుతున్నాయని తెలిపారు. పాదయాత్ర భక్తులంతా తరలి రానుండడంతో పళని క్షేత్రం కిటకిటలాడనుంది.



పంచామృతం తయారీ పనుల్లో పాదయాత్ర కమిటీ సభ్యులు

వాకింగ్‌కు వెళ్తూ ఆరోగ్య మంత్రి తనిఖీలు

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా విరుదాచలం సమీపంలోని పాలకొల్లై గ్రామంలో వాకింగ్‌కు వెళ్లిన ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం అక్కడి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళ్లకురిచ్చి జిల్లా ఉలుందూరుపేటలో ఓ హోటల్‌లో బస చేస్తూ ఆయన రోజు చుట్టుపక్కలి ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేస్తున్నారు. ఆ మేరకు ఉలుందూరు పేట నుంచి ఉదయం టీషర్టు, షార్ట్ ధరించి మంత్రి సుబ్రమణ్యం 16 కి.మీల దూరంలో ఉన్న పాలకొల్లై గ్రామం వెళ్లారు. ఆ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న నర్సులను పలకరించారు. ఆ తర్వాత ఆ ప్రాథమిక కేంద్రం డాక్టర్‌కు ఫోన్ చేసి రోజూ డ్యూటీకి ఏయే సమయాల్లో వస్తున్నారని ప్రశ్నించారు. డాక్టర్ బదులిస్తూ నైవేలిలో తాను బసచేస్తున్నానని, ఉదయం తొమ్మిది గంటలకల్లా డ్యూటీలో ఉంటానని, సాయంత్రం నాలుగు గంటల వరకూ వైద్యసేవలందిస్తున్నానని చెప్పారు. ఆ వివరాలన్నీ వాస్తవమేనని ఆ కేంద్రంలో పని చేస్తున్న సిబ్బంది, స్థానిక ప్రజలు తెలిపారు. అటుపిమ్మట ప్రాథమిక కేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపమంటూ ఆ కేంద్రం డాక్టర్‌కు మంత్రి సూచించారు.



పాలకొల్లై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నర్సుతో మాట్లాడుతున్న ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సారె కానుక



సారె వస్తువులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

ప్యారీస్, జనవరి 31: రాష్ట్రంలో వరుసగా మూడో సారి ప్రజారోగ్యంలో అగ్రస్థానంలో నిలిచిన తంజావూరు కల్లుకుళం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రశంసిస్తూ కార్పొరేషన్ యాజమాన్యం బుధవారం సారె వస్తువులు కానుకగా సమర్పించింది. సేలం కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణం నుంచి మేయర్ రామనాథన్ నేతృత్వంలో డిప్యూటీ మేయర్ అంజుగం, కమిషనర్ మహేశ్వరి తదితరులు మేళతాళాల మధ్య పండ్లు, పూలు, పుష్ప కిరీటాలు తదితర కానుకలతో ఊరేగింపుగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి చేరుకొని, సారె వస్తువులను ఆ కేంద్రం వైద్యులు ముత్తుకుమార్‌కు సమర్పించారు. ఇతర వైద్యులు, నర్సులు, సిబ్బందిని శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

నేడు ట్రేడ్‌సెంటర్‌లో అంతర్జాతీయ తోలు వస్తువుల ప్రదర్శన

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖకు చెందిన తోలువస్తువుల ఎగుమతుల మండలి (సీఎల్ఈ) ఆధ్వర్యంలో మూడు రోజుల అంతర్జాతీయ తోలు వస్తువుల ప్రదర్శన గురువారం ఉదయం ప్రారంభమవుతుందని ఆ మండలి అధ్యక్షుడు రాజేంద్రకుమార్ జలాన్ తెలిపారు. నగరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పాద రక్షల ఎగుమతుల్లో ప్రపంచస్థాయిలో భారతదేశం ద్వితీయ స్థానంలో ఉందని, ఆ పాదరక్షలు తమిళనాటే అధికంగా ఉత్పత్తి చేస్తుండటం గమనార్హమని చెప్పారు. నందంబాక్కంలోని ట్రేడ్ సెంటర్‌లో నిర్వహించే ప్రదర్శనలో 48 దేశాలకు చెందిన 13 వేలకు పైగా వాణిజ్య ప్రతినిధులు పాల్గొనున్నారని, 460 ఎగ్జిబిటర్లు తమ ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచుతారని చెప్పారు. ఫిబ్రవరి 1 నుండి 3వ తేదీ వరకు జరిగే ఈ ప్రదర్శనలో తోలువస్తువులను, పాదరక్షలు అధికంగా ఉంటాయన్నారు. డిజైనర్ ఫేర్ కూడా జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో సీఎల్ఈ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ సెల్వం, ఐటీపీఓ జీఎం ఎస్ఆర్ సాహూ, చైర్మన్ ప్రదీప్‌సింగ్ కరోలా, సీఎల్ఈ సౌత్ రీజనల్ చైర్మన్ ఇస్రార్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో రాజేంద్రకుమార్ జలాన్ తదితరులు

'ఆంధ్ర భాషావర్ధిని' పేరుతో అంతర కళాశాలల పోటీలు

● విజేతలకు బహుమతుల ప్రదానం

అడయార్, జనవరి 31: స్థానిక మెరీనా బీచ్ కామరాజర్ రోడ్డులో ఉన్న రాజధాని కాలేజీ (ప్రెసిడెన్సీ కాలేజీ)లో 'ఆంధ్ర భాషావర్ధిని' పేరుతో అంతర్ కళాశాలల పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన విజేతల పేర్లను కాలేజీలోని తెలుగు శాఖ అధ్యక్షురాలు డాక్టర్ ఎలిజబెత్ జయ కుమారి వెల్లడించారు. తొలుత 'పరవస్తు చిన్నయసూరి' పేర నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో రాజధాని కాలేజీ విద్యార్థులు అనురాధ, చక్రపాణి 'పరవస్తు చిన్నయసూరి రోలింగ్ కప్'ను కైవసం చేసుకున్నారు. అలాగే, పట్టాభిరాంలోని హిందూ కాలేజీకి చెందిన విద్యార్థులు ప్రవల్లిక, యశోదమ్మ ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. ఉత్తమ బహుమతిని రాణిమేరీ కాలేజీ విద్యార్థిని ప్రశాంతి దక్కించుకోగా, ఉత్తమ ద్వితీయ బహుమతిని కందస్వామి నాయుడు కాలేజీ విద్యార్థి యోగేశ్వర రావు గెలుచుకున్నారు. ఆ తర్వాత 'కందుకూరి వీరేశలింగం పంతులు' పేర నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో మొదటి, రెండు బహుమతులను రాజధాని కాలేజీ విద్యార్థులు చక్రపాణి, అనురాధ గెలుచుకున్నారు. మూడో బహుమతిని మద్రాస్ క్రిస్టియన్ కాలేజీ విద్యార్థి సాత్విక్ పాల్ అందుకున్నారు. 'కొక్కొండ వెంకటరత్నం పంతులు' పేరుతో జరిగిన క్విజ్ పోటీల్లో మొదటి బహుమతిని ప్రెసిడెన్సీ కాలేజీ విద్యార్థి అనురాధ, మాధవి, చక్రపాణిలు గెలుచుకున్నారు. అలాగే, ద్వితీయ బహుమతిని మద్రాస్ క్రిస్టియన్ కాలేజీ విద్యార్థులు సాత్విక్, తిరుమల, రేవంత్, తృతీయ బహుమతిని భారతి మహిళా కాలేజీ విద్యార్థులు గెలుచుకున్నారు. విజేతలను సీనియర్ పాత్రికేయురాలు రాజేశ్వరి సత్కరించి, అభినందించారు. చివరగా డాక్టర్ మురళి వందన సమర్పణతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



సుచిత్ర కె.ఎల్లాకు 'సేక్ ఆఫ్ ఆనర్ అవార్డు'



సుచిత్ర ఎల్లాకు అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

అడయార్, జనవరి 31: భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, కో-ఫౌండర్ సుచిత్రా కె.ఎల్లాకు రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ 'ఫర్ ది సేక్ ఆఫ్ ఆనర్' అవార్డు 2023-24'ను ప్రకటించింది. భారత్ బయోటెక్ అభివృద్ధిలో గత పాతిక సంవత్సరాలుగా ఆమె ఎనలేని కృషి చేశారు. ఆమె నాయకత్వంలో భారత్ బయోటెక్ 433 పేటెంట్లను దాఖలు చేయగా, 145కి మంజూరయ్యాయి. ప్రధానంగా ప్రపంచ గుర్తింపు పొందిన కోవాగ్జిన్ వ్యాక్సిన్ ఆమె న్యాయకత్వంలోనే ఆవిష్కరించారు. అంతేకాకుండా, మహిళల సాధికారత, మెంటరింగ్ తదితర వర్క్‌షాపుల నిర్వహణ వంటి కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తుంటారు. మహిళలు తమ లక్ష్యాలను చేరుకోవడానికి వీలుగా ఆమె ఇండియన్ ఉమెన్స్ నెట్‌వర్క్‌తో కలిసి పనిచేస్తున్నారు. ఆమె సేవలకు గుర్తుగా, రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఈ అవార్డును ప్రదానం చేసింది.

బెంగళూరుకు విస్తరించిన అతుల్యా సీనియర్ కేర్ సేవలు

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజెన్ల కోసం అన్ని హంగులతో నివాస సదుపాయాలు కల్పిస్తున్న అతుల్యా సీనియర్ కేర్ సంస్థ తన సేవలను బెంగళూరుకు విస్తరింపజేసిందని ఆ సంస్థ వ్యవస్థాపకులు తెలిపారు. ఈ మేరకు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కార్తీక్‌నారాయణన్ ఓ ప్రకటన జారీ చేస్తూ... బెంగళూరు వైట్‌ఫీల్డ్ ప్రాంతంలో రెండో నివాస సముదాయ భవనాన్ని సంస్థ వ్యవస్థాపకులు కృష్ణ కావ్య, జి.శ్రీనివాసన్ సమక్షంలో క్రికెటర్ వెంకటేష్ ప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభించినట్లు తెలిపారు. ఈ నివాస సముదాయంలో వృద్ధులకు సేవలందించటానికి సేవకులు కూడా అందుబాటులో ఉంటారని, వారికి నిరంతరం వైద్యసేవలకు అందించేందుకు వైద్యులు ఉంటారని పేర్కొన్నారు. వృద్ధులు శేషజీవితాన్ని ప్రశాంతంగా గడిపేందుకు అతుల్యా సీనియర్ కేర్‌లు దోహదపడతాయని పేర్కొన్నారు.



అతుల్యా సీనియర్ కేర్ భవనసముదాయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న క్రికెటర్ వెంకటేష్ ప్రసాద్, సంస్థ ఎండీ డాక్టర్ కార్తిక్ నారాయణన్ తదితరులు

ఎలియట్స్ బీచ్‌లో అలరించిన కోస్ట్‌గార్డ్ విన్యాసాలు

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఎలియట్స్ బీచ్ వద్ద భారత నావికాదళం హెలికాప్టర్లు, నౌకలతో నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గురువారం జాతీయ కోస్ట్‌గార్డ్ దినాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం నుంచే ఈ విన్యాసాలు నిర్వహించారు. సముద్రంలో మునిగిన వారిని కాపాడటం, నడి సముద్రంలో శత్రువులపై బాంబు దాడి , హెలికాప్టర్ నుంచి కోస్ట్‌గార్డ్ సభ్యులు తాడు పట్టుకుని వేగంగా నిర్దేశిత స్థలంలో దిగటం వంటి సాహసకృత్యాలను నిర్వహించారు. ఆ సందర్భంగా తీరానికి చేరువుగా విద్యుద్దీపాలతో అలంకరించిన నౌకలు లంగరేసి నిలవడం సందర్శకులను ఆకట్టుకుంది.



ఎలియట్స్ బీచ్ వద్ద ఎగురుతున్న కోస్ట్‌గార్డ్ హెలికాప్టర్



విద్యుత్ దీపాల అలంకరణతో మిరిమిట్లు గొల్పుతున్న కోస్ట్‌గార్డ్ గస్తీ నౌకలు



కోస్ట్‌గార్డ్ నౌకలో దీపాల వెలిగింపు దృశ్యం

దక్షిణ భారత్‌లో కొత్త శాఖలు

● ఇండెల్ మనీ లిమిటెడ్

ప్యారీస్, జనవరి 31: తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల్లో కొత్త శాఖలు ప్రారంభిస్తున్నట్లు ఇండెల్ మనీ లిమిటెడ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ ఉమేష్ మోహనన్ పేర్కొన్నారు. స్థానిక టినగర్‌లో బుధవారం ఉదయం ఏర్పాటుచేసిన విలేకరులతో సమావేశంలో ఆయన ఆ సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ జిజిత్‌రాత్‌తో కలిసి మాట్లాడారు. తమ సంస్థ గోల్డ్ లోన్ సెక్టారులో వేగంగా అభివృద్ధి చెందుతోందని, మంగళవారం నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లను విడుదల చేసిందన్నారు. దీని ద్వారా రూ.200 కోట్ల వరకు సమీకరించేందుకు పథకం రూపొందించినట్లు తెలిపారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ సహ 12 రాష్ట్రాల్లో 2025 నాటికి 425 శాఖలు విస్తరింపజేసే దిశగా ఇష్యూలను విడుదల చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా రూ.1,000 ముఖవిలువ కలిగిన ఎన్‌సీడీలను జారీ చేయనున్నామని, ఫిబ్రవరి 12వ తేది వరకు కాలపరిమితి నిర్ణయించినట్లు ఉమేష్ తెలిపారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సీఈఓ ఉమేష్ మోహనన్, జిజిత్‌రాత్

చెన్నై టి.నగర్ పానగల్ పార్కు వద్ద భూగర్భంలో చురుకుగా సాగుతున్న మెట్రోరైల్వేస్టేషన్ నిర్మాణ పనులు





